క్లుప్తంగా

కొక్కిరాపల్లి ఘాట్ రోడ్డులో పొదల తొలగింపు



పొక్లెయిన్‌తో పొదలు తొలగిస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: జి.మాడుగుల–చింతపల్లి మార్గంలో కొక్కిరాపల్లి ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదలు, పిచ్చిమొక్కలను ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ షణ్ముఖరావు మాట్లాడుతూ కొక్కిరాపల్లి ఘాట్ రోడ్డులో ఏపుగా పొదలు పెరగడం వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని, వాహనదారుల సమస్యలు, ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని వాహన ప్రమాద నివారణ చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

వాహనాల రికార్డులు సక్రమంగా ఉండాలి



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు: వాహనాల రికార్డులు సక్రమంగా ఉండాలని ఎస్‌ఐ జె.రామకృష్ణ అన్నారు. మండల కేంద్రం ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు వెళ్లే మార్గంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించిన వాహనాలకు ఫైన్ వేశారు. వాహనదారులు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాన్స్‌పోర్ట్ వెహికల్‌కు ఇన్సూరెన్స్ తప్పకుండా చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కొత్త ఉపాధ్యాయులకు సన్మానం



నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మిషన్ తాజంగి సభ్యులు

చింతపల్లి: తాజంగి పంచాయతీ నుంచి నూతనంగా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని మిషన్ తాజంగి సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల డీఎస్సీలో తాజంగి పంచాయతీ నుంచి హిందీ పండిట్లుగా ఎంపికైన అడ్డాల స్వామినాయుడు(తాజంగి)కిల్లో సుందరరావు(గెత్తంపాకుల)లను ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిషన్ తాజంగి అధ్యక్షుడు శెట్టి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో భారీ వర్షం



సీలేరులో కురుస్తున్న వర్షం

సీలేరు: సీలేరు ప్రాంతంలో రోజూ భిన్న వాతావరణం చోటు చేసుకుంటోంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండ కాస్తూ సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల వరకు తీవ్రమైన ఎండ కాయడంతో జనం బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం రెండుగంటల పాటు కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో గల ఇళ్లల్లోకి వర్షం నీరు ప్రవహించింది. పిడుగులు పడడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.

నేరడివలసలో తాగునీటికి ఇబ్బందులు



కుళాయి వద్ద ఉంచిన బిందెలు

పాడేరు రూరల్: మండలంలో జి.ముంచంగిపుట్టు పంచాయతీ నేరడివలస గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో 160 మంది నివసిస్తున్నారు. విద్యుత్ సరఫరా ఉంటేనే తాగునీరు సరఫరా అవుతోందని, లేకపోతే రోజంతా కష్టాలు పడాల్సిన పరిస్థితి తప్పడం లేదని గ్రామస్తులు కె.భీమేశ్వరావు, ధనుంజయ్,లక్ష్మణ్ తదితరులు ఆదివారం తెలిపారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేకపోయిందని వారు చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్య లేకుండా చూడాలని వారు కోరారు.



బురదమయంగా ఉన్న అరకు వారపుసంత ప్రాంగణం



అరకు వారపుసంత ప్రాంగణం మధ్యలో చెత్త



దుంబ్రిగుడ ఆరోగ్య కేంద్రం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

పారిశుధ్యం... అస్తవ్యస్తం

పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు, చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లోని నీరు రోడ్లపై నిలిచిపోయి మురుగు గుంతలను తలపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

- రోడ్లపై మురుగు, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం
- మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- రోగాల బారిన పడుతున్న గిరిజనులు



కించుమండ జీసీసీ వద్ద మురుగు

దుంబ్రిగుడ: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించింది. మండలం కేంద్రం దుంబ్రిగుడతో పాటు అరకు, పోతంగి, కించుమండ, గసభ, గుంటసీమ తదితర పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. మండల కేంద్రం దుంబ్రిగుడలో పారిశుధ్య కార్మికులు ఉదయం సేకరించిన చెత్తను సమీప ఆరోగ్యకేంద్ర రోడ్డు వద్ద, గుంటసీమ రహదారి వద్ద పడేస్తున్నారు. డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవడంతో చెత్తను ఎక్కడ వేయాలో తెలియక రోడ్డుపక్కన ఎక్కడపడితే పడేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

- మేజర్ పంచాయతీ అరకులో పారిశుధ్యం లోపించింది. వారపు సంత నిర్వహించే షెడ్ల వద్ద చెత్తాచెదారం పేరుకుపోవడంతో సంతకు వచ్చే గిరిజనులు, వ్యాపారులు ముక్కుమూసుకుని గడపవలసి వస్తోంది. చిన్నపాటి వర్షం పడినా వారపు సంత ప్రాంగణం బురదమయంగా మారుతోంది. వారపు సంత నిర్వహించే ప్రాంతంలో మద్యం దుకాణం ఉండడంతో అక్కడ మద్యం సేవిస్తున్న వారు గ్లాసులు, వాటర్ బాటిళ్లు అక్కడే పడేస్తున్నారు. దీంతో చెత్త పేరుకుపోయి ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. సమీపంలోనే తినుబండారాలు, ఇతర ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. వీటిని తిన్న గిరిజనులు వ్యాధుల బారిన పడుతున్నారు.
- కించుమండ పంచాయతీలో అపారిశుధ్యం తాండవిస్తోంది. వ్యాధులు ప్రబలి ఇప్పటికే ఈ పంచాయతీలో పలువురు గిరిజనులు వ్యాధులతో మంచం పట్టారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో మురుగ నీరుతో నిలిచిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది.

పోతంగి, కించుమండ, గసభ, గుంటసీమ పంచాయతీల్లో చెత్తను సేకరించి, దూరంగా తరలించేందుకు ప్రభుత్వం టాక్టర్లను కేటాయించినా అవి వినియోగం లేవు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు మండలంలోని ఈ నాలుగు పంచాయతీల్లో ఏర్పాటు చేసినా వినియోగంలో లేకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి గ్రామాలు కంపుకొడుతున్నాయి. మండలంలోని 18 పంచాయతీల్లో పారిశుధ్యం క్షీణించిందని, డంపింగ్ యార్డ్‌లు ఏర్పాటు చేసి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు



కించుమండ జీసీసీ డిపో ఎదురుగా చెత్తాచెదారం పడేస్తుండడంతో పారిశుధ్యం లోపించింది. ఈ ప్రాంతాన్ని, ఇక్కడ డ్రైనేజీని శుభ్రపరచాలని పంచాయతీ అధికారులకు చాలా సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. వర్షాలు కురిసే సమయంలో డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది.

– బి.రవికుమార్, దుంబ్రిగుడ

చెత్త నుంచి సంపద కేంద్రాలను ప్రారంభిస్తాం

పంచాయతీల్లో చెత్తాచెదారాన్ని కొంత మంది గ్రామస్తుల సాయంతో తొలగిస్తున్నాం. ఆయా పంచాయతీలకు కేటాయించిన ట్రాక్టర్లకు హెడ్‌లు మాత్రమే ఇచ్చారు. తొట్టెలు వస్తే వాటిని వినియోగించేందుకు కృషి చేస్తాం. తడి,పొడి చెత్తను వేరుచేసేందుకు చెత్తా నుంచి సంపద తయారు చేసే కేంద్రాలున్నాయి. వాటిని ఈనెల నుంచి ప్రారంభిస్తాం.

– ఎస్.వి.వి. నరసింహమూర్తి, ఎంపీడీవో, దుంబ్రిగుడ మండలం.

బహుళ అంతస్తుల భవనాలపై చర్యలు తీసుకోవాలి

చింతూరు: ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులు నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. చింతూరు మండలం ఎర్రంపేటలో గిరిజనేతరులు నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనానికి అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారో బహిర్గతం చేయాలని, ఎర్రంపేటలో 250 అక్రమ భవనాలు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆయన తెలిపారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను అధికారులు వెంటనే కూల్చివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎట్టకేలకు మెట్టగూడ రహదారి పనులు ప్రారంభం



మెట్టగూడ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ తుమిడిపుట్టు జంక్షన్ నుంచి మెట్టగూడ వరకూ నిర్మించనున్న రహదారి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఆదివారం సర్పంచ్ త్రినాథ్, స్థానిక నేతలు రోడ్డు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ తుమిడిపుట్టు జంక్షన్ నుంచి మెట్టగూడ గ్రామం వరకు రెండు కిలో మీటర్ల రహదారికి పీఎం జన్‌మన్ ద్వారా రూ. 1,87,08,000 మంజూరైనట్టు చెప్పారు. ప్రతి రోజు పాఠశాలకు వచ్చే మెట్టగూడ విద్యార్థులు మెట్టగూడ వాగు అతికష్టం మీద దాటుకుంటూ వస్తున్నారని, గ్రామస్తులు నిత్యావసర సరుకులు,రేషన్ సరుకులు తీసుకువెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని చెప్పారు. రోడ్డు మంజూరవడంతో మెట్టగూడ గ్రామ గిరిజనుల రవాణా కష్టాలు తీరనున్నాయన్నారు.

నిరసనను విజయవంతం చేయండి

జెడ్పీటీసీ రోషిణి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రోషిణి

అరకులోయటౌన్: కూటమి నాయకులు నకిలీ మద్యాన్ని తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని జెడ్పీటీసీ శెట్టి రోషిణి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నకిలీ మద్యం తయారీని నిరసిస్తూ సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయం నుంచి పద్మాపురం జంక్షన్ వద్ద ఉన్న ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఆందోళన చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో యువజన నాయకుడు రేగం చాణిక్య, ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమిడి అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తి పాల్గొన్నారు.



యెజ్జు వెంకటేశ్వరరావు

గంగవరం : నకిలీ మద్యానికి వ్యతిరేకంగా రంపచోడవరం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిర్వ హించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ గంగవరం మండల అధ్యక్షుడు యెజ్జు వెంకటేశ్వరరావు తెలిపారు. మండలం నుంచి వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు ఎక్సైజ్ స్టేషన్ ఎదుట నిరసన

రంపచోడవరం: నకిలీ మద్యానికి వ్యతిరేకంగా స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఎదుట సోమవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు స్థానిక నాయకులు తెలిపారు. నియోజకర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. నిరసన కార్యక్రమంలో కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొనాలని పార్టీ నాయకులు కోరారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

సీలేరు: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం చాలా దారుణమని దారకొండ సర్పంచ్ రాజు అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న ఉద్దేశంతో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి వెనుకబడిన ప్రాంతాల్లో అత్యాధునిక సదుపాయాలతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కాలేజీల నిర్మాణం ప్రారంభించారని చెప్పారు. వాటిని కూటమి ప్రభుత్వం పూర్తి చేయకుండా ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణమన్నారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ప్రభుత్వం ఆధ్వర్యంలోనే పూర్తిచేసి, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. లేని పక్షంలో ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందన్నారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ పెద్ద ఎత్తున జరుగుతోందని తెలిపారు.

17న 'చలో పాడేరు'

ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్



అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ నాయకులు

అరకులోయటౌన్: హైడ్రోపవర్ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా ఈనెల 17న నిర్వహించనున్న చలో పాడేరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ కోరారు. చలో పాడేరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం అరకులోయలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ జీవో నంబర్ 2, 13,51లను రద్దు చేయాలని ఆదివాసీలు ముక్తకంఠంతో నినదిస్తుంటే కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. హైడ్రోపవర్ ప్రాజెక్టు పనులు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రకటించిన 10 రోజుల్లోనే సీలేరులో ఆ ప్రాజెక్టుకు సంబంధించిన పనులకు భూమి పూజ చేశారని తెలిపారు. దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైడ్రోపవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కొండల రావు, దశరథ్, సురేష్ కుమార్, స్వామి, నర్సింగ్, బుజ్జిబాబు, పార్వతి, జమున, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి ఎదుట వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



జిల్లా ఆస్పత్రి ఎదుట వ్యర్థాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

పాడేరు: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్త చెదారాన్ని ఎట్టకేలకు ఆదివారం తొలగించారు. ఆస్పతి ఎదుట పేరుకుపోయిన వ్యర్థాలపై ఆదివారం సాక్షి దినపత్రికలో డంపింగ్ యార్డును తలపించేలా... అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ హేమలత స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ వ్యర్థాలు ఆస్పత్రివి కావని, ఆస్పత్రి ఎదుట అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారివని చెప్పారు. అయినప్పటికీ తాము వెంటనే స్పందించి పంచాయతీ సిబ్బందికి సమాచారమిచ్చి వ్యర్థాలను ఆదివారం ఉదయాన్నే తొలగించామని చెప్పారు. ఆస్పత్రి ఎదుట అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు.

అన్నసమారాధనకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉమామహేశ్వరి,ప్రదీప్‌చంద్ర

సాక్షి,పాడేరు: అయ్యప్పస్వామి భక్తులకు స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో మధ్యాహ్నం నిర్వహించే అన్నసమారాధన కార్యక్రమానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి.గాజువాక ప్రాంతానికి చెందిన ఉమామహేశ్వరి,ఆమె కుమారుడు ప్రదీప్‌చంద్రలు రూ.10,116 ఆదివారం ఆలయ కమిటీకి అందజేశారు. ఆర్థిక సాయం అందించిన దాతలకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

అసంపూర్తిగా కాఫీ గోదాం భవనం



చింతపల్లిలో అసంపూర్తిగా ఉన్న కాఫీ గోదాం భవనం

చింతపల్లి: స్థానిక కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్ పక్కన నిర్మిస్తున్న కాఫీ గోదాం భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. పాడేరు డివిజన్ పరిధిలో గల 11 మండలాల్లో గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీని చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్‌కు తరలించి పప్పును తయారు చేస్తారు. అలా తయారు చేసిన కాఫీని భద్రపరిచేందుకు పల్పింగ్ యూనిట్ పక్కనే రూ.10 లక్షల వ్యయంతో గోదాం నిర్మాణం చేపట్టి, అసంపూర్తిగా నిలుపుదల చేశారు. ఏడాది కాలంగా ఆ భవనం అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. దీంతో తయారుచేసిన పప్పును కాఫీ పల్పింగ్ యూనిట్‌లో ఉన్న ఓ భవనంలో భద్రపరుస్తున్నారు. వచ్చే నెల నుంచి ఎకో పల్పింగ్ యూనిట్‌లో కాఫీ తప్పు తయారు చేసే కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న గోదాం నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కాఫీ రైతులు కోరుతున్నారు.

ఆర్థిక,సామాజిక అంశాలపై అవగాహన అవసరం



చింతలవీధిలో గిరిజన మహిళలతో వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు కీర్తి

చింతపల్లి: ఆర్థిక, సామాజిక అంశాలపై గిరిజన మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి అన్నారు. మండలంలో చింతలవీధి, రాజుపాకలు, చినబరడ గ్రామాల్లో ఆదివారం మహిళలకు ఆర్థిక,సామాజిక అభివృద్ధి, విద్య,ఉపాధి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో స్వయం ఉపాధి కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. మహిళా రైతులు ఆదాయనిచ్చే స్టాబెర్రీ, అవకాడో, అనాసపనస తదితర తోటల పెంపకంతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ సునీత, కౌన్సెలర్ విజయ,సమన్వయకర్త సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగవరంలో పీజీఆర్‌ఎస్

గంగవరం : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలి



ఎంపీపీ అనూష దేవిని సన్మానిస్తున్న హెచ్‌డబ్ల్యూవోలు, విద్యార్థులు

చింతపల్లి: విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించి మంచి ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి అన్నారు. స్థానిక డిగ్రీ బాలుర,బాలికలు పోస్టు మెట్రిక్ వసతి గృహాల విద్యార్థులతో ఆదివారం ఆమె సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారానికి బోర్ల నిర్మాణానికి మండల పరిషత్ నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. విద్యార్థులు డిగ్రీ చదువుతూనే పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీని వసతి గృహాల హెచ్‌డబ్ల్యూవోలు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగలక్ష్మి,కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి, హెచ్‌డబ్ల్యూవోలు పద్మావతి, వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.

15న రాజవొమ్మంగి మండల సమావేశం

రాజవొమ్మంగి : మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

కుమ్మరిపుట్టు రహదారి పూర్తి చేయాలి



కుమ్మరిపుట్టు రహదారి

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టులో బీటీ రహదారి నిర్మాణం పూర్తి చేయాలని సర్పంచ్ వెంగడ రమేష్,గ్రామస్తులు కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కిందట కుమ్మరిపుట్టుకు రహదారి మంజూరైందని, పనులు ప్రారంభించారని చెప్పారు. ఇప్పటి వరకూ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో 106 కుటుంబాలకు చెందిన 400 మంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రహదారి అసంపూర్తిగా ఉండిపోయిందని తెలిపారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, గ్రామస్తుల కష్టాలు గుర్తించి, రహదారి పూర్తి చేయాలని సర్పంచ్ రమేష్ కోరారు.

ఘనంగా దైవసేవకుల దినోత్సవం



దైవకృపను సన్మానిస్తున్న క్రైస్తవ కుటుంబాలు

సాక్షి,పాడేరు: ప్రపంచ దైవసేవకుల దినోత్సవాన్ని ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రార్థనా మందిరాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దైవసేవకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అన్ని ప్రార్థనా మందిరాల్లో దైవసేవకులను క్రైస్తవ కుటుంబాలు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించాయి. పాడేరులోని కారుణ్య ప్రార్థనా మందిరం దైవసేవకులు డాక్టర్ చిక్కాల దైవకృపతో పాటు పలు ప్రార్థనా మందిరాల సేవకులను ఘనంగా సన్మానించారు.